నేడే.. జడ్జిమెంట్ డే..!

- ముషీరాబాద్ నియోజకవర్గం...
- 14 టేబుళ్లు, 21 రౌండ్‌లు
- పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు కోసం అదనంగా మరో రెండు టేబుళ్లు
- పోలీసుల పహారాలో ఏవీ కళాశాల


ముషీరాబాద్ కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న హైదరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి రొనాల్డ్‌రాస్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కోసం దోమలగూడ ఏవీ కళాశాలలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. నియోజకవర్గంలోని 289 ఈవీఎంలను లెక్కించేందుకు మొత్తం 14 టేబుళ్ల ఏర్పాటు చేసి 21 రౌండ్‌లలో కౌంటింగ్ పూర్తి చేయనున్నట్లు ముషీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.లక్ష్మీనారాయణ తెలిపారు. దోమలగూడ ఏవీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన 289 ఈవీఎంలను ప్రతి రౌండ్‌కు 14 ఏవీఎంల లెక్కింపు జరుగుతుందని ఆయన వివరించారు. కౌంటింగ్ కోసం సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏవీ కళాశాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని, మొదట పోస్టల్ బ్యాలెట్స్‌లో వచ్చిన ఓట్లను లెక్కిస్తామని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో 715 పోస్టల్ బ్యాలెట్స్ వచ్చాయని వాటిని లెక్కించిన తరువాత ఈవీఎంలలో ఉన్న ఓట్లను లెక్కిస్తామని తెలిపారు. ప్రతి 40 నిమిషాలకు రౌండ్‌ల వారీగా లెక్కించిన ఓట్ల వివరాలను ప్రకటిస్తామన్నారు. 21 రౌండ్‌ల ఈవీఎం కౌంటింగ్ పూర్తి అయిన తరువాత 5 వీవీప్యాట్స్ స్లిప్‌లను అభ్యర్థుల సమక్షంలో లెక్కించడం జరుగుతుందని ఆయన వివరించారు. ప్రతి అభ్యర్థికి మద్దతుగా వచ్చే కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటలలోపే కౌంటింగ్ కేంద్రంలోకి రావాలని ఆదేశాలు జారీ చేశారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల అధికారి...

దోమలగూడ ఏవీ కళాశాలలో ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ సెంటర్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి రొనాల్డ్ రాస్, వివిధ శాఖల అధికారులు పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొన్న సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కౌంటింగ్‌లో పాల్గొన్న అభ్యర్థులు వారి ఏజెంట్లు, పార్టీల నేతలు ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఆయన కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు.


ఏవీ కళాశాల వద్ద పోలీసుల బందోబస్తు


కౌంటింగ్‌కు సిద్ధం చేసిన టేబుళ్లు

అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో...

- 14 టేబుళ్లు, 18 రౌండ్‌లు
- నల్లకుంట నుంచి ప్రారంభమై నల్లకుంటతోనే కౌంటింగ్ ముగింపు


ఆర్‌వో అపర్ణ

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కోసం అధికారులు సిద్ధం చేశారు. బర్కత్‌పురాలోని రెడ్డి ఉమెన్స్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్, నగర్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య సందర్శించారు. ఆర్‌వో అపర్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం అవుతుంది. మొత్తం 14 టేబుళ్లలో 18 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు ఉంటుందని ఆర్‌వో అపర్ణ వెల్లడించారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి సాధారణ ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు.

ఫలితాలు ఇలా...

నియోజకవర్గంలో ఉన్న 5 డివిజన్‌లలో 239 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. నల్లకుంట డివిజన్‌లో ఉన్న పోలింగ్ బూత్‌ల నుంచి ప్రారంభమై తిరిగి నల్లకుంట డివిజన్‌లో ఉన్న రెండు బస్తీల్లో ఉన్న ఓట్ల లెక్కింపుతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగుస్తుంది. నల్లకుంట ఓట్ల లెక్కింపు అనంతరం బాగ్ అంబర్‌పేట, అంబర్‌పేట, గోల్నాక డివిజన్‌ల అనంతరం కాచిగూడ డివిజన్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది.



బర్కత్‌పురాలోని ఓట్ల లెక్కింపు కేంద్రం

6న అంబేడ్కర్ స్మారక ఉపన్యాసం

కాచిగూడ: అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 6న సాయంత్రం నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ ఆడిటోరియంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మారక ఉపన్యాం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్ తెలిపారు. విశ్వ వైతాళికుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అనే అంశంపై అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. గత 37 సంవత్సరాలుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది డిసెంబర్ 6న స్మారకోపన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేధావులు, కవులు, కళాకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాని వారు కోరారు.

ఉద్యమకారులను గుర్తించి.. ఆదుకోండి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలి దశలో జరిగిన ఉద్యమంలో పాల్గొని ఎంతో మంది ఉద్యమకారులు తీవ్రంగా నష్టపోయారని, వారిని గుర్తించి అన్ని విధాలా ఆదుకోవాల్సిన అవసరం తెలంగాణలో వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ ఎస్.యాదగిరి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సమితి సమావేశం యాదగిరి అధ్యక్షతన కాచిగూడలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ప్రవుల్‌రాంరెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ... మలిదశ అమరుడు శ్రీకాంతాచారి డిసెంబర్ 3న తుది శ్వాస విడిచారని, ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దొర 10 సంవత్సరాల పీడ నుంచి తెలంగాణ విముక్తి కాబోతున్నదని అన్నారు. తెలంగాణ అమరుల కుటుంబాలు, ఉద్యమకారుల నిరంతర కృషితో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించబోతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలను, ఉద్యమకారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరికీ నెలకు రూ. 25 వేలు గౌరవ పింఛన్ ఇవ్వాలని వారు రానున్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కో చైర్మన్ మంచాల వెంకటస్వామి, కల్లెపు చంద్రన ప్రసాద్, హరికృష్ణ, ఉద్యమకారులు పాల్గొన్నారు.

కాలుష్యంతో ప్రమాదంలో మానవాళి


ఫీవర్ ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటుతున్న దృశ్యం

నల్లకుంట: పర్యావరణ కాలుష్యం కారణంగా మానవ మనుగడ ప్రమాదంలో పడిందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ) వ్యవస్థాపకుడు ఎస్.సి.హెచ్.రంగయ్య పేర్కొన్నారు. శనివారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ అర్బన్ బయోడైవర్సిటీ సహకారంతో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మితో కలిసి రంగయ్య మొక్కలు నాటి మాట్లాడారు. ఢిల్లీ లాంటి మహా నగరాలు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయని, దీంతో అక్కడి జన జీవనం అస్తవ్యస్తంగా మారిందన్నారు. కోరలు చాస్తున్న వాయు కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా ఓ మొక్కను నాటాలని కోరారు. పర్యావరణ వేత్తలు జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల్లో నరాలు తెగే ఉత్కంఠ!

ఉదయం 11 గంటల కల్లా ట్రెండ్ తెలిసే అవకాశం

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎవరిని విజయం వరిస్తుందో మరికొన్ని గంటల్లో తేలనుంది. ఇందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గెలుపు, ఓటములపై ఆయా పార్టీల అభ్యర్థులు బేరీజు వేసుకుంటున్నారు. తప్పకుండా తామే విజయం సాధిస్తామని పైకి మేకపోత గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా లోపల మాత్రం వారిని భయం వెంటాడుతూనే ఉందనే చెప్పొచ్చు. ఈ దఫా జరిగిన ఎన్నికల్లో విజయం ఎవరి వైపు వరిస్తుందో అంత తేలికగా చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో 2009 నుంచి 2018 వరకు మూడు దఫాలుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా అభ్యర్థులు సాధించిన ఓట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎవరు ఉన్నారనేదానిపై అంచనా వేసుకోవాల్సి ఉంది. 2009 ఎన్నికల్లో టి.మణెమ్మ విజయం సాధించగా ద్వితీయ స్థానంలో డాక్టర్ కె.లక్ష్మణ్ ఉన్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో డాక్టర్ కె.లక్ష్మణ్ 27 వేల మెజార్టీతో విజయం సాధించగా ముఠా గోపాల్ ద్వితీయ స్థానంలో ఉన్నారు. 2018లో జరిగిన ఎన్నికల్లో ముఠా గోపాల్ 37 వేల మెజార్టీతో విజయం సాధించగా అనిల్‌కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మూడు ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన అభ్యర్థే వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం గమనార్హం. 2023లో జరిగిన ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారో వేచి చూడాలి.

భోలక్‌పూర్ డివిజన్‌లో అత్యధిక పోలింగ్....

ప్రస్తుత ఎన్నికల్లో భోలక్‌పూర్ డివిజన్‌లో అత్యధిక శాతం పోలింగ్ నమోదు కాగా అతి తక్కువగా గాంధీనగర్ డివిజన్‌లో పోలింగ్ శాతం నమోదైంది. భోలక్‌పూర్‌లో 53.38 శాతం పోల్ కాగా గాంధీనగర్‌లో 47.18 శాతం పోల్ అయింది.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే: రేవంత్‌రెడ్డి


రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్న డాక్టర్ రోహిణ్‌రెడ్డి, దిడ్డి రాంబాబు


బీసీ జాగృతి అధ్యక్షుడు మురళీకృష్ణ

కాచిగూడ: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డితో కలిసి జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్ పులి జగన్‌లు శనివారం రేవంత్‌రెడ్డిని కలిసి పూలబొకే అందజేసి అభినందించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, తెలంగాణ ప్రజలందరికీ రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

బీసీ జాగృతి అధ్యక్షుడు...

నల్లకుంట: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందనే పలు సర్వే ఫలితాల నేపథ్యంలో శనివారం తెలంగాణ బీసీ జాగృత అధ్యక్షుడు కె.పి.మురళీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించి అంబర్‌పేటలో పార్టీ అభ్యర్థి గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు.

అన్నదానం.. పుణ్యకార్యం



చిక్కడపల్లి: అన్నిదానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ డయాబెటిస్ చైర్మన్ డాక్టర్ జీకే రమణ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో అల్పాహారాన్ని పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ... రెండు నెలలుగా ప్రతి శనివారం అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 5న అన్నదానం కూడా ఇక్కడే నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దాంతో ఎంతో కొంత సేవా కార్యక్రమాలను వినియోగించడం ఉత్తమమైన పని అన్నారు. కార్యక్రమంలో లయన్ మనీష్, సాయి రితీష్, జతిన్, లక్ష్మణ్, శివకుమార్, ప్రవీణ్, అఖిలేష్‌లు పాల్గొని పేదలు, పోటీ పరీక్షల అభ్యర్థులకు అల్పాహారాన్ని అందజేశారు.

9న క్రైస్తవ వివాహ పరిచయ వేదిక

కాచిగూడ: క్రైస్తవ వివాహ పరిచయ వేదికను ఈ నెల 9వ తేదీన శనివారం గోల్కొండ ఎక్స్ రోడ్స్‌లోని ఎంబీ బేతెల్ చర్చిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ ఎస్.అబ్రహం తెలిపారు. దేశ వ్యాప్తంగా వేలాది వివాహ సంబంధాలు అందుబాటులో ఉన్నాయని, క్రైస్తవ వధూవరులు, వారి తల్లిదండ్రులు ఈ వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు ఫోన్స్: 88850 73555, 88854 28555లలో సంప్రదించాలని సూచించారు.

విజయోత్సవ ర్యాలీలకు 'నో'

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆదివారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇందులో భాగంగానే స్టేడియం పరిసర ప్రాంతాలన్నింటినీ పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఇప్పటికే అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టారు. సాయంత్రం 4 గంటల వరకు పూర్తి ఫలితాలు వెలువడే అవకాశాలున్నాయి. అయితే విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని జూబ్లీహిల్స్ ఏసీపీ కె. హరిప్రసాద్ తెలిపారు.

విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు


సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠాగోపాల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ ఎస్‌బీఐ కాలనీలోని సాయిబాబా దేవాలయంలో ముఠా గోపాల్ గోత్రం చదివించి స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు వేదపండితుల చేయించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్, నాయకులు భీమ్, కృష్ణ, ఉప్పలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్..

ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కవాడిగూడ కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అంజన్‌కుమార్‌యాదవ్ అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ముషీరాబాద్‌లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, డివిజన్ కాంగ్రెస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు జానకి, సుధాకర్, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు

పేదలకు చేయూత

లిబర్టీ: ఆకలితో అల్లాడుతున్న పేదలకు ఆహారం, అల్పాహారం అందించి ఆ యువకుడు ఆదర్శంగా నిలిచాడు. ఒకవైపు విద్యాభ్యాసం చేస్తూ మరో వైపు తనకు వచ్చిన స్కాలర్‌షిప్‌తో పేదరికంలో మగ్గుతూ పుట్‌పాత్‌లపై, రైల్వే స్టేషన్‌లలో జీవనం సాగిస్తున్న నిరుపేదలకు చేయూతనిస్తున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ చేస్తున్న ఇటికాల గణేష్ తనకు వచ్చిన స్కాలర్‌షిప్‌తో ఆప్తుల అనురాగాలకు నోచుకోక నా అనేవాళ్లు లేక పేదరికంలో గడుపుతూ సహాయం కోసం ఎదురు చూస్తున్న వారికి ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఆహారం అందిస్తూ అక్కున చేర్చుకుంటున్నారు. దళిత బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న గణేష్ లిబర్టీ, ట్యాంక్‌బండ్, లక్డీకాపూల్, బషీరాబాగ్, ఆదర్శనగర్, నాంపల్లిలో జీవనం సాగిస్తున్న వారికి ఆహారం అందిస్తున్నారు.

అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తాం


విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ రూపారెడ్డి తదితరులు

అంబర్‌పేట: విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తామని బచ్‌పన్ పాఠశాలల డైరెక్టర్ రూపారెడ్డి తెలిపారు. బచపన్ విద్యా సంస్థల ఇంటర్ స్కూల్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీడీ కాలనీలోని పాఠశాల ఆవరణలో శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రూపారెడ్డి మాట్లాడుతూ... చిన్నారులు విద్యతోపాటు ఇతర రంగాల్లో రాణించేలా తమవంతు తోడ్పాటును అందిస్తామన్నారు. ఒత్తిడి లేని విద్యను అందించడమే లక్ష్యంగా తమ పాఠశాలలో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్‌కు ఒక వైపు నుంచే అనుమతి

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆదివారం ఓట్ల లెక్కింపు జరగనుండగా పోలీసులు భద్రత పెంచారు. ఈ రహదారిలో అనుమతి లేని వాహనాలు, వ్యక్తులు రాకుండా ఇప్పటికే నిషేధాజ్ఞలు విధించారు. దీని ముందే యూసుఫ్‌గూడ మెట్రో రైల్వే స్టేషన్ ఉండటంతో స్టేడియం వైపు ఉన్న మెట్ల పైనుంచి కాకుండా రోడ్డుకు అవతలి వైపు ఉన్న మెట్ల మార్గాన్ని మెట్రో ఎక్కేవారు. దిగేవారు వినియోగించుకోవాలని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ పి. రవీంద్రప్రసాద్ తెలిపారు.

బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

లిబర్టీ: పార్లమెంటు సమావేశాలు ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కుల గణన చేసేందుకు ప్రధాన మంత్రి స్పష్టమైన ప్రకటన చేసి తమ చిత్తశుద్ధిని నిలుపుకోవాలని కోరారు. శనివారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు.

ఉత్తమ వైద్య అధ్యాపకులకు సన్మానం

పంజగుట్ట: దేశానికి ఉత్తమ వైద్య నిపుణులను తయారు చేస్తున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉత్తమ వైద్య అధ్యాపకులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బోర్డ్ అక్రెడిటెడ్ ఇనిస్టిట్యూట్ ఘనంగా సత్కరించింది. మొత్తం 54 మంది ఉత్తమ వైద్య అధ్యాపకులను శనివారం సోమాజిగూడ పార్క్ హోటల్‌లో సత్కరించారు. ఆయా సంస్థల ప్రతినిధులు డాక్టర్ మీను జాజ్బాయ్, డాక్టర్ లింగయ్య, మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... మహానగరం వైద్య రంగానికి హబ్‌గా మారిందని, వైద్య రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. నాణ్యమైన వైద్య విద్యతో పాటు పరిశోధనల సంఖ్య కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్ సమయంలో వైద్య విద్యార్థులు చేసిన సేవలు మరవలేనివని, వేలాదిమందిని కాపాడారని తెలిపారు. ప్రతి వెయ్యి మందికి ఒక వైద్యుడు ఉండాలి కానీ దేశంలో 1456 మందికి ఒక వైద్యుడు ఉన్నాడని ఈ అంతరాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిత

కాచిగూడ: విద్యార్థులు ఇష్టపడి చదివితే లక్ష్యాలను చేసుకోవడం సులువని, తద్వారా ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటదాస్ అన్నారు. అవంతి పీజీ కళాశాల ఎంసీఏ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు శనివారం నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారానే కెరీర్‌లో అత్యుత్తమ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువతకు అవకావం లభిస్తుందన్నారు. యువత తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో అటువంటి వారికి ఎక్కువగా అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ (హెచ్ఆర్) డాక్టర్ జయప్రద, కార్తికేయ కుమార్, ఎం.దుర్గ, ప్రొఫెసర్ సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.


వేడుకలను ప్రారంభిస్తున్న ఓయూ ప్రొఫెసర్ వెంకటదాస్

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

నిందితుల్లో ఇద్దరు మైనర్లు

కాచిగూడ: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని కాచిగూడ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు సమాచారం మేరకు... మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన భిక్షపతి కుమారుడు గువలపల్లి లక్ష్మణ్ అలియాస్ రాజు(20), ఇద్దరు మైనర్లు. గత నెలలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ ముగ్గురు ద్విచక్ర వాహనాలను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా వాహనంపై తిరుగుతున్న లక్ష్మణ్, ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాన్ని అంగీకరించారు. వారి నుంచి 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని లక్ష్మణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు మైనర్లను సైదాబాద్ జువైనల్ హోంకు తరలించినట్లు అడ్మిన్ ఎస్ఐ మేఘన తెలిపారు. ఎస్ఐలు సుభాష్, పి.రవికుమార్, మహంకాళితో పాటు క్రైం సిబ్బంది పాల్గొన్నారు.


నిందితుడు, స్వాధీనం చేసుకున్న వాహనాలతో కాచిగూడ పోలీసులు